www.prajasakti.com

ప్రజాశక్తి

మంగళవారం 9 జులై 2024

5

తిరుపతి

ఇసుక అక్రమ రవాణా చేస్తే కఠిన చర్యలు: కలెక్టర్

ప్రజాశక్తి -తిరుపతి టౌన్

నేటినుంచి ఇసుక నూతన పాలసీ అమలవుతుందని, నామమాత్రపు ఛార్జీలతో ఇసుక సరఫరా చేస్తామని, అక్రమ రవాణాకు తావులేకుండా పటిష్ట నిఘా ఉంచి చర్యలు తీసుకోవాలని కలెక్టర్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్ అధికారులను ఆదేశించారు. సోమవారం మధ్యాహ్నం సత్యవేడు నియోజకవర్గంలోని నాగలాపురం మండల పరిధిలోని సుబ్బానాయుడు కండ్రిగ ఇసుక స్టాక్ పాయింట్‌ను ఎంఎల్ఎ ఆదిమూలంతో కలిసి కలెక్టర్ పరిశీలించారు. సుబ్బానాయుడు కండ్రిగ, బైటికోయంబేడు రీచ్ వద్ద ఇసుక మెట్రిక్ టన్నుకు రూ. 200 గా డిస్ట్రిక్ట్ లెవెల్ శాండ్ కమిటీ నిర్ణయించిందని, ఈ మొత్తాన్ని రీచ్ ప్రాంత రహదారులు, ర్యాంపులు తదితరాల అభివద్ధికి వినియోగించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా గనుల శాఖ అధికారి ప్రకాష్ కుమార్ పాల్గొన్నారు.

'గంగ' లేదని 'బెంగ'

- చెరువులు నిండని వర్షాలు
- కండలేరు 'డెడ్' స్టోరేజి
- ఆందోళనలో అన్నదాతలు
- ఆల్తూరుపాడు రిజర్వాయర్ ఎప్పటికో

ప్రజాశక్తి - డక్కిలి

నెల్లూరు- తిరుపతి జిల్లాల పరిధిలో సాగునీరు, తాగునీటి కష్టాలు తీర్చేందుకు సోమశిల జలాశయానికి అనుసంధానంగా కండలేరు జలాశయాన్ని నిర్మించారు. 65 టీఎంసీల సామర్థ్యమున్న జలాశయం ప్రస్తుతం 6 టీఎంసీల నీటి నిల్వతో డెడ్‌స్టోరేజీకి చేరుకుంది. దీంతో 2 లక్షల ఎకరాల్లో సాగు, చెన్నై, తిరుపతి, నాయుడుపేట, రాపూరు ప్రాంతాలకు తాగునీరు సరఫరా ప్రశ్నార్థకంగా మారింది. వర్షాభావ పరిస్థితులతో జలాశయంలో నీటినిల్వలు అడుగంటాయి. జలాశయం ఆయకట్టు పరిధిలో లక్షల ఎకరాల సాగుకు నీరు లేదు. రానున్న రెండు నెలల్లో వర్షాలు కురిసే వరకు డెడ్‌స్టోరేజీలో ఉన్న నీటిని కేవలం తాగునీటి కోసం మాత్రమే కేటాయించడం జరుగుతుందని తెలుగుగంగ అధికారులు చెబుతున్నారు. రానున్న రెండుమూడు మాసాల్లో శ్రీశైలం ప్రాజెక్టు, రాయలసీమ ప్రాజెక్టులు ద్వారా సోమశిల నిండిన తర్వాత దాని నుంచి కండలేరుకి 40 టీఎంసీలు తీసుకుంటే నవంబరులో పంటలు సాగుచేసే వారికి నీళ్లు ఇవ్వడం జరుగుతుందని తెలుగుగంగ ఎస్ఈ వెంకటరమణారెడ్డి చెబుతున్నారు.

వాగ్దానాలకే ఎస్ఎస్‌కెనాల్ పరిమితం

తిరుపతి జిల్లాలోని వెంకటగిరి, శ్రీకాళహస్తి నియోజకవర్గాలకు సాగునీరు.. తిరుపతి, చంద్రగిరి, శ్రీకాళహస్తి నియోజకవర్గాల ప్రజలకు తాగునీరు అందించే సోమశిల-స్వర్ణముఖి లింక్ కెనాల్ ఎన్నికల్లో వాగ్దానాలకే పరిమితం అయ్యిందని రైతులు వాపోతున్నారు. 2006లో రూ.344 కోట్ల రూపాయల అంచనాలతో సోమశిల-స్వర్ణముఖి కాలువ నిర్మాణాన్ని ప్రారంభించి... దాదాపు 220 కోట్ల మేర ఖర్చుపెట్టి కొంత మేర నిర్మాణాలు పూర్తి చేశారు. 2012 నాటికి ఈ ప్రాజెక్టు పూర్తి చేయాలన్న లక్ష్యం పాలకుల నిర్లక్ష్యంతో నీరుగారిపోయింది. గడచిన కొన్నేళ్లుగా మిగిలిన పనులు పూర్తి చేసేందుకు నిధులు విడుదల చేయకపోగా...ఇప్పటికే పూర్తైన కాలువ నిర్వహణకూ నిధులు కేటాయించలేదు. ఫలితంగా కాలువ నిర్వహణ సరిగ్గా లేక పిచ్చిమొక్కలు పెరిగి వాటి నాణ్యత ప్రశ్నార్థకంగా మారింది. జిల్లాలోని రాపూరు, డక్కిలి, వెంకటగిరి, శ్రీకాళహస్తి, ఏర్పేడు మండలాల్లోని లక్షన్నర ఎకరాలకు సాగునీరు అందించడమే లక్ష్యంగా సోమశిల - స్వర్ణముఖి కాలువ పనులు చేపట్టారు. ఈ కాలువ నుంచే పరిసర ప్రాంతాల జలాశయాలను నింపి 140 గ్రామాలకు తాగునీరు అందించేలా ప్రణాళికలు రూపొందించారు.

ఆల్తూరుపాడు రిజర్వాయర్‌దీ అదే పరిస్థితి

జిల్లాలోని డక్కిలి మండలం ఆల్తూరుపాడు రిజర్వాయరు పనులు అర్ధాంతరంగా ఆగిపోయాయి. గత వై సీ పీ ప్రభుత్వంలో రివర్స్ టెండరింగ్ విధానంలో పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్ కొంతమేర పనులు చేసి నిలిపివేశారు. అదేవిధంగా ఆ ప్రాజెక్టుకు సంబంధించి ఎత్తిపోతల పనులు చేపట్టాలి. ఈ పనులు పూర్తి చేయడానికి సుమారు రూ.420కోట్లు కావాలని అంచనా. ఆల్తూరుపాడు రిజర్వాయరు సామర్థ్యం 1.008 టీఎంసీలు. దీని నిర్మాణం పూర్తయితే లింక్ కెనాల్ ద్వారా రోజుకు 2,500 క్యూసెక్కుల నీటిని విడుదల చేసి... 316 చెరువులను నింపాలన్నది లక్ష్యం. ఎస్ ఎస్ లింక్ కెనాల్ నిర్మాణ పనులకు అభయారణ్యం, అటవీ అనుమతుల్లో జాప్యం వల్ల ప్రాజెక్టు డిజైన్ మార్చి గత టిడిపి ప్రభుత్వం ఆల్తూర్పాడు రిజర్వాయర్ ప్రాజెక్టు ను 2019 లో శంకుస్థాపన చేశారు. సత్యసాయి గంగ (తెలుగుగంగ) కాలువ 34.10కి.మీ. వద్ద నుంచి అంటే జిల్లా లోని డక్కిలి మండలం ఆల్తూరుపాడు వద్ద రిజర్వాయరులోకి ఎత్తి పోసే విధంగా నూతన డిజైన్ రూపొందించారు. ఈ ప్రాజెక్టు పూర్తయితే సుమారు 50వేల మంది రైతులకు లబ్ధి చేకూరుతుంది. అయితే పనులు పూర్తి చేయడానికి అవసరమైన నిధులు ప్రభుత్వం విడుదల చేయడం లేదు. దీంతో నిర్మాణం ఎప్పుడు పూర్తవుతుందో చెప్పలేని పరిస్థితి. ఈ పనులు పూర్తయితే కాలువ పరివాహక ప్రాంతాల్లో తాగునీటి సమస్య కూడా తీరనుంది. పాలకులు ఇకనైనా సోమశిల-స్వర్ణముఖి అనుసంధాన కాలువ పనులపై శ్రద్ధ చూపాల్సిన అవసరం ఉంది.

'గుంతల' గాయాలు..!

బీసీ హాస్టల్‌కు 'దారి'చూపండి

ప్రజాశక్తి - రేణిగుంట

చెరువును తలపిస్తున్న బీసీ హాస్టల్‌కు వెళ్లే రహదారి

బీసీ హాస్టల్ విద్యార్థుల పట్ల అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని, హాస్టల్‌కు వెళ్లే రహదారి గుంతలమయమై వెళ్లడానికి వీల్లేకుండా ఉందని విద్యార్థులు వాపోతున్నారు. ఈ హాస్టల్లో దాదాపు 350 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. వర్షం వచ్చిందంటే విద్యార్థులు గోతుల్లో జారిపడి గాయాల పాలవుతున్నారు. ఇటీవల కురుస్తున్న వర్షాలకు గుంతలన్నీ వర్షపు నీటితో నిండిపోయి చెరువులను తలపిస్తోంది. రేణిగుంట తహశీల్దార్ కార్యాలయంతో పాటు, పారిశ్రామికవాడకూ ఇదే దారి. అయినా అధికారుల్లో స్పందన నిల్. ఈ సమస్యపై తహశీల్దార్, ఎంపిడిఒ దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోలేదని జెవివి నాయకులు ఒ.వెంకటరమణ, కుప్పస్వామి వాపోతున్నారు. హాస్టల్‌కు వెళ్లే దారి మట్టిరోడ్డు కావడంతో పురుగు పుట్ర, చెట్లు విపరీతంగా ఉన్నాయి. రాత్రిపూట వీధిలైటుల లేకపోవడంతో భయంభయంగానే ఆ మార్గంలో వెళ్లాల్సి ఉంటుంది. ఎంపిడిఒ జోక్యం చేసుకుని తారు రోడ్డు వేయాలని అనేకమార్లు సిపిఎం, జెవివి ఆధ్వర్యంలోనూ ధర్నాలు, రాస్తారోకోలు చేసి వినతిపత్రం ఇచ్చారు. అయినా అధికారులు మీనమేషాలు లెక్కిస్తూ నిర్లక్ష్యంగానే వ్యవహరించడం 'బలహీన వర్గ విద్యార్థుల సౌకర్యాల పట్ల' వారికి ఉన్న చిత్తశుద్ధి అర్థమవుతోంది. మాజీ ఎంఎల్ఎ బియ్యపు మధుసూదన్‌రెడ్డికి వినతిపత్రం ఇచ్చినా పట్టించుకోలేదు. హాస్టల్లో తాగునీటి కనెక్షన్ లేకపోవడంతో నీళ్లకోసం విద్యార్థుల బాధ వర్ణనాతీతం. ఇకనైనా ఉన్నతాధికారులు స్పందించి బీసీ హాస్టల్లో నెలకొన్న అసౌకర్యాలను పరిష్కరించి, విద్యార్థుల చదువుకు ఇబ్బంది లేకుండా చూడాల్సి ఉంది. సిమెంట్ రోడ్డు వేయాలని, వీధిలైట్లు వెలిగేలా చూడాలని, ఫిల్టర్ నీటిని అందించాలని సోమవారం ఎంపిడిఒకు, తహశీల్దార్‌కు, ఎంఇఒకు వినతిపత్రం ఇచ్చారు.

అర్జీలను అర్థవంతంగా పరిష్కరించాలి: కలెక్టర్



సురుటుపల్లి ఆలయంలో కలెక్టర్, ఎంఎల్ఎ

ప్రజాశక్తి -తిరుపతి టౌన్

ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చిన అర్జీలను సకాలంలో అర్థవంతమైన పరిష్కారం చూపాలని, అలసత్వం సహించేది లేదని కలెక్టర్ డా.ఎస్. వెంకటేశ్వర్ అధికారులను ఆదేశించారు. సోమవారం ఉదయం స్థానిక జిల్లా కలెక్టరేట్ నందు ఏర్పాటు చేసిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో జిల్లా కలెక్టర్ తో పాటు డిఆర్ఓ పెంచల్ కిషోర్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు మురళి, దేవేంద్ర రెడ్డి, కోదండరామి రెడ్డి తో కలిసి వివిధ ప్రాంతాల నుండి వచ్చిన అర్జీదారుల నుండి వినతులను స్వీకరించారు. 115 అర్జీలు సోమవారం అందాయి. కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి సోమవారం పెద్ద ఎత్తున ప్రజలందరూ కలెక్టరేట్ కి రావడం వలన వారికి అన్ని సౌకర్యాలను ఏర్పాటు చేసి ఎవరికి ఎటువంటి ఇబ్బంది కలగకుండా చూసుకుంటున్నామన్నారు. ప్రతి అర్జీదారునికి ముందుగా ఒక టోకెన్ జనరేట్ చేసి టోకెన్ ఆధారంగా ఎవరు ముందు వస్తే వారి అర్జీని స్వీకరించడం జరుగుతుందని అన్నారు. సమస్య పరిష్కారానికి సమయం కావాల్సి వస్తే నిర్దేశించిన సమయంలోపు పరిష్కరిస్తామన్నారు.

మీ కోసంకు 73 ఫిర్యాదులు

తిరుపతి సిటీ : జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన మీకోసం ప్రజా సమస్యల పరిష్కార వేదికలో 73 ఫిర్యాదులు అందాయని జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు తెలిపారు. ప్రజల నుండి జిల్లా ఎస్పీ నేరుగా ఫిర్యాదులను స్వీకరించి, వారి సమస్యలను అడిగి తెలుసుకుని, వాటిని సంబంధిత పోలీస్ అధికారులకు అప్పగించి సకాలంలో పరిష్కార మార్గం చూపాలని ఆదేశించారు. వికలాంగులు, వృద్ధులు, మహిళల ఫిర్యాదులకు మొదట ప్రాధాన్యతనిస్తూ సత్వరమే సమగ్ర విచారణ జరిపి, వారి సమస్యలను పరిష్కరిస్తామని జిల్లా ఎస్పీ తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీలు వెంకట్రావు, కులశేఖర్, విమల కుమారి, వెంకటాద్రి పాల్గొన్నారు.

పోలీసు ఫుడ్‌కోర్టు ప్రారంభం

తిరుపతి పోలీస్ పరేడ్ మైదానం, జిల్లా సాయుధ దళం కార్యాలయం వద్ద పోలీస్ సిబ్బంది సంక్షేమమే పరమావధిగా భావించి సోమవారం జిల్లా ఎస్పీ వి. హర్షవర్ధన్ రాజు ఫుడ్ కోర్టును ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ విధి నిర్వహణలో ఉండి ఇంటికి వెళ్లి భోజనం చేయడానికి సమయం లేని పోలీసుల సౌకర్యార్థం, ఈ ఫుడ్ కోర్టులో నాణ్యమైన భోజనం, టిఫిన్ తక్కువ రేటుకు అందుబాటులో ఉంటుందన్నారు. ఎటువంటి లాభాపేక్ష లేకుండా పోలీసులకు నాణ్యమైన ఆహారాన్ని అందించడమే ఈ ఫుడ్ కోర్ట్ ముఖ్య ఉద్దేశం అన్నారు.

సురుటుపల్లిలో కలెక్టర్

నాగలాపురం : సురుటుపల్లి శ్రీ పళ్లి కొండేశ్వర స్వామిని కలెక్టర్ వెంకటేశ్వర్, సత్యవేడు ఎంఎల్ఎ కోనేటి ఆదిమూలం దర్శించుకున్నారు. సోమవారం సాయంత్రం 3 గంటలకు చేరుకున్న కలెక్టర్, ఎంఎల్ఎలకు ఆలయ అర్చకులు పూర్ణకుంభ స్వాగతం పలికారు. ప్రధాన అర్చకులు కార్తికేయ గురుక్కల్ ఆలయ స్థల పురాణాన్ని కలెక్టర్‌కు వివరించారు.

రోడ్డుపై పొంగిపొర్లుతున్న మురుగునీటిని పరిశీలిస్తున్న సిపిఎం నేతలు

మధురానగర్ 'మురుగుమయం'

సిపిఎం

ప్రజాశక్తి -తిరుపతి టౌన్

ప్రజా సమస్యలపై మధురానగర్‌లో సిపిఎం నేతలు పర్యటించి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ ప్రాంతంలో పొంగి పొర్లుతున్న అండర్ డ్రైనేజ్ వల్ల డ్రైనేజీ కాలువలు శుభ్రం చేయకపోవడం వల్ల ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు సిపిఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు దృష్టికి తీసుకొచ్చారు. గుర్తించిన సమస్యలపై మున్సిపల్ డిఈకి, శానిటేషన్ సిబ్బంది దష్టికి తీసుకెళ్లడమే కాకుండా మున్సిపల్ కార్యాలయంలో మధుర నగర్ పారిశుధ్య సమస్యపై మున్సిపల్ కమిషనర్‌కు సిపిఎం ఆధ్వర్యంలో వినతి పత్రం సమర్పించారు. సమస్యలను పరిష్కరిస్తామని అధికారులు హామీ ఇచ్చారు. చిన్నపాటి వర్షానికే రోడ్లు పై మురుగు పొంగి ప్రవహిస్తోందని, అధికారులు స్పందించకుంటే స్థానికులతో కలిసి ఉద్యమిస్తామని హెచ్చరించారు. ఈ పర్యటనలో సిపిఎం నేతలు టి.సుబ్రమణ్యం, కే వేణుగోపాల్, ఎం మాధవ్, పి బుజ్జి, మల్లికార్జునరావు పాల్గొన్నారు.

'అధికార' అరాచకం

- పేదల భూమి కబ్జాకు యత్నం
- న్యాయం కోసం రోడ్డెకిన బాధితులు

ప్రజాశక్తి-తిరుపతి సిటి

నాలుగున్నర దశాబ్దాలకుపైగా నివాసం ఉంటున్న పేదల భూమిపై అధికార పార్టీ నాయకులు కన్నేశారు. అటు రెవెన్యూ, ఇటు పోలీసు అదికారులను ఉసిగొల్పి కబ్జాకు తెరలేపారు. నగర నడిబొడ్డున స్థలం కావడంతో దాని ధర కోట్లు పలుకుతోంది. ఇంకేముంది అభాగ్యులపై అరాచకానికి పథకం వేశారు. వచ్చిన సొమ్మును తలా పిడికెడు పంచుకుందాం అంటూ వాటాలేసుకుంటున్నారు. బాధితులను భయభ్రాంతులకు గురి చేస్తున్నారు. విధిలేని పరిస్థితుల్లో తమ స్థలాన్ని కాపాడుకునేందుకు వృద్దురాలైన బాదితురాలు తన పిల్లలతో రోడ్డెక్కి, నిరసనకు పూనుకోవడం గమనార్హం. వివరాల్లోకి వెళ్లితే.....

తిరుపతి కొర్లగుంట సంజయ్‌గాంధీ కాలనీలోని అక్కారంపల్లి లెక్కదాఖలు సర్వే నెంబరు : 12లోని 90 అంకణాల స్థలాన్ని బండి వెంకట సుబ్బమ్మకు 1992లో ప్రభుత్వం డికెటి పట్టా ఇచ్చింది. కుంటస్థలమైన అక్కడ అంతకు ముందు సుమారు 1950 నుంచే వెంకటసుబ్బమ్మ తాత ఉండేవారు. కానీ దానికి ఎలాంటి ప్రభుత్వ అనుమతులు లేవు. 1979లో బి.వెంకటసుబ్బమ్మ, ఆమె చెల్లెలు లక్ష్మీదేవమ్మ ఇద్దరు కలిసి తాత స్థలంలోనే నివశించేవారు. 1986 నుంచి ఈ స్థలానికి రెవెన్యూ పన్ను సైతం చెల్లిస్తున్నారు. గుంట పోరంబోకుగా ఉన్న ఈ స్థలంపై తమకు హక్కు కల్పించాలని అనేక సార్లు అధికార్లను వేడుకున్నా స్పందన లేదు. తిరుపతి -తిరుమల బైపాస్‌రోడ్డుకు ఆనుకుని ఉన్న స్థలం కావడంతో 1991లో స్థానికంగా ఉన్న ఓ వ్యాపారవేత్త ఈ స్థలాన్ని కాజేసుందుకు పూనుకున్నారు. 1992లో అప్పటి ఉమ్మడి రాష్ట్ర ముఖ్యమంత్రి ఎన్‌టి రామారావు తిరుమల పర్యటనకు అదే దారిలో వెళ్లే సమయంలో బాధితురాలు ముఖ్యమంత్రికి తమ బాధను తెలియజేసింది. స్పందించిన ఆయన అక్కడికక్కడే స్థానిక రెవిన్యూ అధికారులను పిలిపించి, వెంకటసుబ్బమ్మకు న్యాయం చేయాలని ఆదేశించారు. 1992లో రెవెన్యూ అధికారులు బాధితురాలికి ఆ స్థలంపై డికెటి పట్టా మంజూరు చేశారు. అయితే ముని కమలమ్మ, రాజేశ్వరి అనే మహిళలు ఈ స్థలం తమదంటూ వాదనకు దిగారు. దీన్నిపై కోర్టును ఆశ్రయించారు. 1996లో తిరుపతి కోర్టు వెంకటసుబ్బమ్మకు అనుకూలంగా తీర్పునిచ్చింది. ఈ భూమిపై పర్మినెంట్ ఇంజక్షన్ ఆర్డరు, బాధితులకు పోలీసు ప్రొటెక్షన్ ఇవ్వాలని ఆదేశించింది. బాధితురాలు వెంకటసుబ్బమ్మ స్థానిక సిపిఎం నాయకుల అండతో అదే ప్రాంతంలో ఇల్లు నిర్మించుకుని తన బిడ్డలను పోషించుకునేది. 2023లో వర్షాల వల్ల పక్కనున్న భారీ చెట్టు కూలిపోవడంతో రేకుల షెడ్డు బాగా దెబ్బతింది. దాన్ని తొలగించి, బాధితులు ఇల్లు నిర్మించుకునేందుకు పూనుకున్నారు. అప్పటి అధికార పార్టీ అండతో మరోసారి రాజేశ్వరి వారి అనుచరులు వారిపై గొడవకు రావడంతో మళ్లీ కథ మొదటికొచ్చింది. ప్రస్తుతం ఈ భూమి విలువ సుమారు 4 నుంచి 5 కోట్ల రూపాయలు పలుకుతోంది. దీనిపై కన్నేసిన ప్రస్తుత అదికార పార్టీకి చెందిన వ్యక్తి అటు పోలీసులు, ఇటు రెవిన్యూ అధికారులను వారిపై ఉసిగొల్పారు. తనకు ముఖ్యమంత్రి పేషీనుంచి అండ ఉందని, స్థలాన్ని వదులుకోవాలని మధ్యవర్తుల ద్వారా వారిని బెదిరించారు. గత నెల 20వ తేది ఏకంగా రెవిన్యూ అధికారులు వెంకటసుబ్బమ్మ, వారి కుటుంబ సభ్యులకు నోటీసులు ఇచ్చారు. అది కూడా సర్వేనెంబరు 12/1 పేరుతో ఇవ్వడం గమనార్హం. దీనిపై బాధితులు జిల్లా ఎస్‌పికి, జిల్లాకలెక్టరుకు అనేక సార్లు ఫిర్యాదు చేసిన స్పందన కరువైంది. విధిలేని పరిస్థితుల్లో వారం రోజులుగా బాధితురాలు స్థలం ముందే టెంటు వేసుకుని కుటుంబ సభ్యులతో కలిసి దీక్షకు పూనుకుంది. తనకు న్యాయం జరిగే వరకు నిరసన కొనసాగిస్తానని ఖరాకండిగా చెప్పింది.

న్యాయం చేసేంత వరకూ దీక్ష కొనసాగింపు

టిడిపి అండతోనే కబ్జాకు యత్నం

అధికారంలో ఉన్న టిడిపికి చెందని ఓ నాయకుడు అండతోనే మా స్థలాన్ని కబ్జా చేసేందుకు పూనుకుంటున్నారు. వాస్తవానికి మా స్థలంపై అనేక మంది కన్నుపడింది. ఎవ్వరు అధికారంలో ఉంటే ఆ పార్టీ అండతో మాపై దాడికి దిగుతున్నారు. వీరికి అధికార పార్టీకి చెందని ఓ ప్రముఖ మద్యం వ్యాపారి వెనకుండి ఇదంతా నడిపిస్తున్నాడు. 2011లో ఈస్టు సిఐగా ఉన్న వ్యక్తి మాపై అప్పుడు బాధ్యతారహితంగా ప్రవర్తించారు. ఈయనపై అప్పటి ఎస్‌పికి సైతం ఫిర్యాదు చేయడంతో ఆయన మందలించారు. తిరిగి ఆయన డిఎస్‌పిగా వచ్చాక మళ్లీ మాపై పోలీసులు బెదిరింపులకు దిగుతుండడం బాధాకరం. ఉన్నతాధికారులు స్పందించి మాకు న్యాయం చేయాలి.

-బండి వెంకటసుబ్బమ్మ, బాధితురాలు, తిరుపతి.

మూఢనమ్మకాలపై...

ప్రచారమేది..?

- వేపచెట్టు ఎండిందని ఊరంతా వలస
- అల్లూరి సీతారామరాజు గిరిజన కాలనీలో ఘటన
- వేరుకు వైరస్ సోకడంవల్లే: జనవిజ్ఞాన వేదిక

ప్రజాశక్తి -శ్రీకాళహస్తి

మనిషి ఆదిమ సమాజాన్ని దాటి ఆధునిక సమాజంలో కాలుపెట్టాడు.. 'మంత్రాలకు చింతకాయలు రాలవని' శాస్త్రీయంగా నిరూపణ చేశాడు.. ఊహకందని ప్రయోగాలతో మానవాళికి ఉపయోగపడే ఎన్నో అత్యాధునిక యంత్రాలను కనుగొన్నాడు..భూత వైద్యానికి అందని మహమ్మారిని సైతం సైన్స్ అనే చికిత్స ద్వారా నిలువరించగలిగాడు.. ఒక్క మాటలో చెప్పాలంటే అవయవమార్పిడితో సృష్టికి ప్రతిసృష్టి చేశాడు. అయినా నేటికీ సమాజంలో మూఢ నమ్మకాలకు జీవితాలు బలవుతూనే ఉన్నాయి. అమాయక ప్రజల అజ్ఞానాన్ని ఆసరాగా చేసుకుంటున్న తాంత్రికులు అందినకాడికి దోచుకుంటున్నారు. భయాన్ని ఎరగా వేసి ప్రజల కష్టాన్ని పిండుకుంటున్నారు. అయితే అధికార యంత్రాంగంలో ఏమాత్రం చలనం లేదు. గతంలో ఇలాంటి సంఘటన ఇటీవల తిరుపతి జిల్లా ఏర్పేడు మండలం పరమాలపల్లిలో వెలుగు చూసింది. తాజాగా తిరుపతి జిల్లా తొట్టంబేడు మండలం గుండేలిగుంట పంచాయతీ అల్లూరి సీతారామరాజు గిరిజన కాలనీలో మరో ఘటన చోటు చేసుకుంది. వివరాల్లోకి పోతే..

అల్లూరి సీతారామరాజు కాలనీలో సుమారు 40 గిరిజన కుటుంబాల వారు నివాసం ఉంటున్నారు. ఆ గ్రామం నడిబొడ్డున ఉన్న వేప చెట్టే వారి గ్రామ దేవత. కష్టమొచ్చినా..నష్టమొచ్చినా, బాధ కలిగినా.. ఆనందం వచ్చిన ఆ వేప చెట్టుకే మొరపెట్టుకునేవారు. వేప చెట్టు పచ్చంగా ఉంటే గ్రామంలో శాంతి, లేకుంటే అశాంతి అని భావించేవారు. ఈ క్రమంలో గత కొన్ని నెలలుగా వేప చెట్టు ఎండిపోతూ వస్తోంది. ఇదే సమయంలో కాలనీలో కొంతమంది రోగాల బారిన పడి మతి చెందారు. ఇటీవల పలువురికి డయేరియా సోకడంతో వాంతులు విరోచనాల బారిన పడి ఆస్పత్రుల పాలయ్యారు. ఓవైపు వేపచెట్టు ఎండిపోవడం.. ఇంకోవైపు రోగాలు ప్రబలి మరణాలు సంభవించడం, అందరూ ఆసుపత్రుల ఫాలవ్వడం చూసి గిరిజనులు తీవ్ర ఆందోళనకు లోనయ్యారు. గ్రామ దేవతగా కొలిచే వేపచెట్టు ఎండిపోవడంతో గ్రామానికి అరిష్టం పట్టుకుందనీ, అందుకే ఇలాంటి సంఘటనలు జరుగుతున్నాయని భావించి భూతవైద్యులను ఆశ్రయించారు. భూత వైద్యులు ఇదే అదునుగా మీ గ్రామానికి దెయ్యం పట్టుకుందనీ, వేప చెట్టుకు సరిగ్గా పూజలు చేయకపోవడంతో, గ్రామ దేవతే పిశాచిగా మారిందనీ, శాంతి పూజలు చేయకుంటే మరణాలు మరింత పెరుగుతాయంటూ బెదిరించారు. దీంతో గ్రామంలోని కొన్ని కుటుంబాలు వలస బాట పట్టాయి. ఇక్కడే ఉంటే ప్రాణాలు పోగొట్టుకుంటామనీ, పరిస్థితులు చక్కబడే వరకు బంధువుల ఊర్లలో తలదాచుకుందామంటూ కొన్ని కుటుంబాలు వెళ్లిపోవడం గమనార్హం. మిగిలి ఉన్న కుటుంబాలు భూత వైద్యుల చుట్టూ తిరుగుతూ చేతి చమురు వదిలించుకుంటున్న పరిస్థితి కనబడుతోంది. అల్లూరి సీతారామరాజు గిరిజన కాలనీలో మూఢనమ్మకాలు ప్రబలి ఊరంతా వలస పోతున్నా, గిరిజనులు ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని వణికి పోతున్నా ప్రభుత్వ యంత్రాంగానికి ఏమాత్రం చీమకుట్టినట్లు లేకపోవడం గమనార్హం. ఈ విషయాన్ని గతంలోనే 'ప్రజాశక్తి' ఉన్నతాధికారుల దష్టికి తీసుకెళ్లినా పట్టించుకోకపోవడంతో గిరి పుత్రులకు ఈ దుస్థితి పట్టింది. ఇకనైనా ప్రభుత్వ యంత్రాంగం స్పందించి అల్లూరి సీతారామరాజు గిరిజన కాలనీలో నెలకొన్న మూఢనమ్మకాలను పారదోలేందుకు తగు అవగాహనా కార్యక్రమాలు చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

వేరుకు వైరస్ సోకి ఎండిపోయిన వేప చెట్టు

భయం వద్దు: జేవీవీ

యానాదులు భయం వీడాలని జన విజ్ఞాన వేదిక నాయకులు సూచించారు. అల్లూరి సీతారామరాజు ఎస్టీ కాలనీ లో సోమవారం జనవిజ్ఞాన వేదిక నాయకులు పర్యటించారు. వేపచెట్టు ఎండిపోవడం సహజంగా జరిగేదేననీ, అదేదో అరిష్టంగా భావించి వలసలు పోవడం మానుకోవాలని సూచించారు. కురుస్తున్న వర్షాల కారణంగా కలుషిత నీటితో అతిసార ప్రబలి పలువురు ఆస్పత్రుల పాలయ్యారనీ, దీర్ఘ కాలిక రోగాలతో కొందరు మరణించారని గుర్తు చేశారు. ఇదేదో అరిష్టంగా భావించి భూత వైద్యులకు డబ్బులు దారబోయద్దని సూచించారు. ముఖ్యంగా విద్యార్థులను బడులకు పంపకుండా ఉండొద్దని సూచించారు. మండల ఉపాధ్యాక్షులు మునీశ్వర రెడ్డి, కార్యదర్శి చెంచయ్య పాల్గొన్నారు. వేరుకు వైరస్ సోకడం వల్ల చెట్టు ఎండిపోయిందని తెలిపారు.

వైద్య ఆరోగ్య సదుపాయాలు కల్పించండి

వైద్య ఆరోగ్య శాఖ మంత్రికి వినతి

మంత్రిని అభినందిస్తున్న మునెయ్య

ప్రజాశక్తి-డక్కిలి: వెంకటగిరి ప్రజలకు వైద్య ఆరోగ్య సదుపాయాలు కల్పించాలని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్‌ను ఏపీ ప్రజా సంఘాల ఐక్య వేదిక అధ్యక్షుడు గడ్డం మునెయ్య కోరారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సచివాలయం వెలగపూడిలో మంత్రిని సోమవారం మునెయ్య కలిసి పుష్పగుచ్ఛం ఇచ్చి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా వెంకటగిరి నియోజకవర్గ పరిధిలో చాలామంది కిడ్నీ రోగులు డయాలసిస్ సమస్యతో బాధపడుతున్నారని, డయాలసిస్ సెంటర్ స్థానికంగా లేకపోవడంతో దూర ప్రాంతాలకు వెళ్లి వైద్యం చేయించు కోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని, వెంకటగిరి పట్టణంలో కిడ్నీ డయాలసిస్ సెంటర్‌ను ఏర్పాటు చేయాలని మంత్రిని మునెయ్య కోరారు. వెంకటగిరి పట్టణంలో గోషాస్పత్రిని అభివృద్ధి చేయాలని, వంద పడకల ఆసుపత్రి నిర్మాణం చేపట్టి అన్ని రకాల ఆధునిక వైద్య సదుపాయాలు కల్పించాలని కోరారు. స్పందించిన మంత్రి వైద్యఆరోగ్యశాఖ సెక్రటరీతో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తానని తెలిపారన్నారు.

పారిశుధ్యంపై అవగాహన

ప్రజాశక్తి - రేణిగుంట: రేణిగుంట పంచాయతీ మెకానిక్ షెడ్డు సమీపంలో ఉన్న అపరిశుభ్ర పరిస్థితిపై, దోమల లార్వా వల్ల కలిగే ఇబ్బందులను వివరించి పారిశుధ్య పరిరక్షణపై షెడ్డు యజమానికి సోమవారం అవగాహన కల్పించారు. పాంచాలి నగర్‌లో హెల్త్ సూపర్‌వైజర్ కామాక్షమ్మ ఇంటింటికి వెళ్లి టైఫాయిడ్, నులి పురుగుల వంటి నట్టల వ్యాధులు, డయేరియా, దోమల వ్యాప్తి వంటి సీజనల్ వ్యాధుల నివారణకు పరిశుభ్రత ఆవశ్యకతను వివరిస్తూ అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఆశా కార్యకర్తలు కళ్యాణి, విమల, శాంతకుమారి పాల్గొన్నారు.

వరదయ్యపాలెం: డయేరియాపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు ఉదయ్ కుమార్ తెలిపారు సోమవారం స్థానిక జిల్లా పరిషత్ ప్రాథమిక ఉన్నత పాఠశాల విద్యార్థిని విద్యార్థులకు డయేరియా, డెంగీ వంటి వ్యాధులపై అవగాహన కలిగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జూలై 1 నుండి ఆగస్టు 31వ తేదీ వరకు జరుగుతున్న స్టాప్ డయేరియా, డెంగీ వ్యతిరేక మాసోత్సవం వంటి కార్యక్రమాల గురించి విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నామని పేర్కొన్నారు. ఇంటి పరిసరాల్లో దోమలు వ్యాపించకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఇలాంటి తమ దృష్టికి తెస్తే సకాలంలో మెడికల్ క్యాంపులు నిర్వహించి నివారిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యులు, ప్రధానోపాధ్యాయులు రమణయ్య, హెల్త్ ఆఫీసర్ మధుసూదన్, ఏఎన్‌ఎం శాంతి, ఎంఎల్ హెచ్‌పి స్వప్న, మహిళా సంరక్షణ కార్యదర్శి జ్ఞాన ప్రసూన ఇంజినీరింగ్ అసిస్టెంట్ నాగమణి, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి: తహశీల్దారు

ప్రజాశక్తి -దొరవారిసత్రం : ప్రజలు ఇచ్చిన ప్రతి ఫిర్యాదును విచారించి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని దొరవారిసత్రం మండల తహశీల్దార్ బిఎస్‌కెహెచ్ ప్రసాద్ ఫిర్యాదు దారులకు సూచించారు. సోమవారం ప్రజా ఫిర్యాదుల వేదిక నిర్వహించారు. మండలంలోని పలువురు భూ సమస్యలపై ఆయనకు ఫిర్యాదు చేశారు. ఆయా గ్రామాల సమస్యలు సంబంధిత అధికారులను విచారించి ప్రతి సమస్యను పరిష్కరించేందుకు చర్యలు చేపడతామన్నారు. మండలంలోని ప్రజలకు ఏ సమస్య వున్నా ప్రతి సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో ఫిర్యాదు చేయవచ్చని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో శివరాజు, ఏవోశా రూప రామయ్య, ఏపీఎం పద్మావతి, విద్యాశాఖ అధికారి కృష్ణయ్య, విద్యుత్ లైన్ ఇన్‌స్పెక్టర్ సుబ్రహ్మణ్యం , అటవీశాఖ బాలయ్య, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

వీధుల్లోనే మురుగు నీరు

తేలికపాటి వర్షానికే వీధులు దుర్గంధ భరితం

ప్రజాశక్తి-తిరుపతి డెస్క్ : ఏర్పేడు మండలం మర్రి మంద గ్రామ పంచాయతీలో తేలికపాటి వర్షానికే దళితవాడ వీధులు దుర్గంధ భరితంగా తయారవుతున్నాయి. సమగ్రంగా రోడ్లు లేకపోవడం వల్ల, డ్రైనేజ్ కాలువలు నిర్మించక పోవడమే ఈ సమస్యకు ప్రధాన కారణమని గ్రామస్తులు చెబుతున్నారు. ఇలా మురుగు నీరు నిల్వ ఉండడం వల్ల దోమలు వ్యాపించి పిల్లలు, పెద్దలు విష జ్వరాల పాలవుతున్నారని తెలిపారు. ప్రభుత్వం, అధికారులు వెంటనే స్పందించి ఈ సమస్యను పరిష్కరించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

17న ప్రజాప్రతినిధులకు సన్మాన మహోత్సవం

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం) దేశవ్యాప్తంగా ప్రజా ప్రతినిధులుగా ఎన్నికైన వారికి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కురుబ, కురుమ, కురువ సంఘం, షెపర్డ్ ఇండియా ఇంటర్నేషనల్ సంయుక్త ఆధ్వర్యంలో ఈనెల 17న తిరుపతిలోని ఓ ప్రైవేటు ఫంక్షన్ హాల్ లో ఘనంగా సన్మాన మహోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు ఆ సంఘం అధ్యక్షులు జబ్బల శ్రీనివాసులు తెలిపారు. సోమవారం తిరుపతి ప్రెస్ క్లబ్ లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ మహోత్సవంలో హర్యానా రాష్ట్ర గవర్నర్ బండారు దత్తాత్రేయ, మంత్రి సవిత, హిందూపూర్ పార్లమెంటు సభ్యులు పార్థసారథి, కర్ణాటక మాజీ మంత్రి ఏ హెచ్ విశ్వనాథ్ ఇలా 25 మందికి సన్మానం చేయనున్నామన్నారు. కురుబ, కురుమ, కురువ కులానికి చెందిన కూటమి ప్రభుత్వం రెండు ఎమ్మెల్సీ స్థానాలను, ఐదు నామినేటెడ్ చైర్మన్ పదవులను, టిటిడి పాలకమండలిలో సభ్యులుగా అవకాశం కల్పించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును, ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ ను విజ్ఞప్తి చేస్తున్నామన్నారు. ఆధ్యాత్మిక క్షేత్రం తిరుపతి పరిసర ప్రాంతాల్లో కనకదాస భవన నిర్మాణానికి స్థల కేటాయింపు చేయాలని కోరారు. ఈ విలేకరుల సమావేశంలో సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు రెడ్డి కుమార్, జిల్లా అధ్యక్షులు మంగిరి రెడ్డప్ప, యువజన విభాగ అధ్యక్షులు శ్రీను, రామాంజులు పాల్గొన్నారు.

'ట్రెండ్స్' పాఠశాలకు కంప్యూటర్ వితరణ

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం)మంగళం ట్రెండ్స్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు ఆ పాఠశాల రిటైర్డ్ సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయుడు స్టీఫెన్ గాబ్రియల్, జీవశాస్త్ర ఉపాధ్యాయురాలు ఏ. వసుంధర కలసి అసెంబ్లడ్ కంప్యూటర్ ను వితరణగా అందించారు. తాను పనిచేసిన పాఠశాలకు ఉపాధ్యాయులు ఉపయుక్తమైన వస్తువులను ఇవ్వడం అభినందించదగ్గ విషయమని పాఠశాల ప్రధానోపాధ్యాయులు కేశవులు నాయుడు అన్నారు. ఈ కంప్యూటర్ ను పాఠశాల అవసరాలకు వినియోగిస్తామన్నారు.

తాగునీటి సమస్యకు పరిష్కారం

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: పట్టణంలోని లోబావి వాసుల తాగినీటి సమస్యను ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి పరిష్కరించారు. ఆయన ఆదేశాల మేరకు సోమవారం సతీమణి బొజ్జల రిషితా రెడ్డి బోరు వేయించారు. కుళాయిలు ఏర్పాటు చేసి లోబావి వాసులకు శాశ్వత తాగునీటి పరిష్కారం చూపారు. టిడిపి నాయకులు విజయ్ కుమార్ నాయుడు, రంగినేని చెంచయ్య నాయుడు, మున్సిపల్ కమిషనర్ రమేష్ బాబు పాల్గొన్నారు.

పేదలకు వరం లేబర్ ఇన్సూరెన్స్

- తెల్ల రేషన్ కార్డు వున్న వారు అర్హులు
- ఉద్యోగులు అనర్హులు

ప్రజాశక్తి -బాలాయపల్లి : పేదలకు లేబర్ ఇన్సూరెన్స్ ఎంతో భరోసాగా ఉంటుంది.18 ఏళ్ల నుండి 55 ఏళ్లు ఉన్న స్త్రీ, పురుషులు ఇన్సూరెన్స్‌కు అర్హులు. లేబర్ ఇన్సూరెన్స్ కు ఒకసారి రూ110 చెల్లిస్తే 5 సంవ త్సరాలు వరకు ఎటువంటి నగదు చెల్లించక్కర్లేదు. ఒకే సంవత్సరానికి రూ.22 లెక్కన చెల్లించాలి. ఇది కార్మికులకు మాత్రమే వర్తిస్తుందని చాలా మంది అనుకుంటారు. తెల్ల రేషన్ కార్డు కలిగి వున్న ప్రతి కుటుంబం ఈ పథకానికి అర్హులే. ప్రభుత్వ ఉద్యోగులు తప్ప ఎలాంటి కూలీలైనా, ఇతరులైనా లేబర్ ఇన్సూరెన్స్ కు అర్హులు, రేషన్ కార్డు, ఆధార్ కార్డు జెరాక్స్ జతపరచి దీంతో పాటు చలానా జతచేసి లేబర్ కార్యాలయంలో ఇవ్వాలి.

అధికారులు నిర్లక్ష్యం.. నష్టపోతున్న పేదలు

లేబర్ ఇన్సూరెన్స్ అంటే తెలియక గ్రామీణ ప్రాంతంలో ఉన్న వారు నష్టపోతున్నారు. సంబంధి తాధికారులు పట్టించుకోక పేదలకు నష్టం వాటిల్లుతోంది. మండల కేంద్రంలో ప్రధాన కార్యాల యం వద్ద నోటీసు బోర్డులో పూర్తి సమాచారం అందుబాటులో ఉండాలి. మండల పరిషత్ శాఖ, రెవెన్యూ శాఖ అధికారులు తమకు ఎందుకులే అనే ధోరణిలో వున్నారు. దీంతో పేదలకు పూర్తి అన్యాయం ఎదురవుతోంది.

లేబర్ ఇన్సూరెన్స్ ప్రయోజనాలు

పాలసీదారుడు సహజ మరణం పొందితే రూ.1,30,000లు ఇన్సూరెన్స్ నగదు వస్తుంది.

అలాగే ప్రమాద వశాత్తూ మరణం వల్ల రూ.6,00,000లు వర్తిస్తుంది. ఇక ఒక ఇంట్లో ఇద్దరు ఆడపిల్లలు వుంటే ఒకొక్కరికి వివాహ నజరానాగా రూ.30 వేలు, ప్రసవ కానుకగా రెండు ప్రసవాలకు రూ.30 చొప్పున వచ్చే అవకాశం ఉంది. పాలసీ పొందిన ఏడాదికే లబ్ధిదారునికి ప్రమాదం జరిగి 50 శాతం వికలాంగులుగా మారితే రూ 2.50 లక్షలు, ఇక100 శాతం ఉంటే రూ 5 లక్షల పరిహారం పొందే అవకాశం వుంది. మీ మండలంలోని కార్మిక అధికారిని(లేబర్ ఆఫీసర్) ఎంపీడీఓ,తహశీల్దారును సంప్రదించాలి

శ్రీశ్రీ కళా వేదిక రాష్ట్ర మహిళ అధ్యక్షురాలుగా ధనాసి ఉషారాణి

ప్రజాశక్తి-చిన్నగొట్టిగల్లు: స్థానిక భాకరాపేటకు చెందిన తెలుగు ఉపన్యాస కురాలు, రచయిత్రి ధనాశి ఉషారాణి తిరుపతి శ్రీశ్రీ కళా వేదిక రాష్ట్ర మహిళా అధ్యక్షురాలుగా నియమితులయ్యారని శ్రీశ్రీ కళా వేదిక ప్రతి నిధులు సోమవారం తెలిపారు. తిరుపతి జిల్లాలో జానపద స్వరగానం, సంక్రాంతి సంబరాలు కార్యక్రమంలో ఆమె విశిష్ట సేవలందించారు. సాహితీ సేవలో భాగంగా తిరుపతి జిల్లాలో రాష్ట్ర మహిళ ప్రధాన కార్యదర్శి హోదాలో నిర్వహించిన జాతీయ శతాధిక కవి సమ్మేళనాన్ని వినూత్న పద్ధతిలో విజయవంతంగా నిర్వహించారు. ఆమె ప్రతిభ, సేవలను గుర్తించి ఆమెను శ్రీశ్రీ కళా వేదిక రాష్ట్ర మహిళ అధ్యక్షురాలుగా నియమించామని శ్రీశ్రీ కళా వేదిక అంతర్జాతీయ ఛైర్మన్ కత్తిమండ ప్రతాప్ తెలిపారు. ఈ సందర్భంగా జాతీయ సమన్వయ కర్త కొల్లి రమావతి, జాతీయ అధ్యక్షురాలు ఈశ్వరీ భూషణం, రాష్ట్ర మహిళ అధ్యక్షురాలు చిట్టె లలిత, జాతీయ ప్రధాన కార్యదర్శి పార్థసారధి, డేబ విజయకుమార్, తోటి ఉపన్యాసకులు, రచయితలు ఆమెకు ప్రత్యేక అభినందనలు తెలిపారు. ఇప్పటికే ఆమె ప్రతిభకు గుర్తింపుగా అనేక ప్రముఖ సంస్థలు అవార్డులు రివార్డులు ఇచ్చి సత్కరించడం విశేషం.

పట్టాదారు పాసుపుస్తకాలు మంజూరు చేయండి

సిపిఎం నాయకుల వినతి

వినతిపత్రాలు సమర్పిస్తున్న సిపిఎం నాయకులు

ప్రజాశక్తి - గూడూరు టౌన్: గూడూరు మండలంలోని రైతులకు పట్టాదారు పాసు పుస్తకాలు సకాలంలో మంజూరు చేయాలని గూడూరు సిపిఎం సెంట్రల్ శాఖ కార్యదర్శి జోగి శివకుమార్ సబ్ కలెక్టర్, ఎమ్మెల్యేలను కోరారు. గూడూరు పట్టణంలోని సబ్ కలెక్టర్ ఆవరణలో ప్రజా విజ్ఞప్తుల దినాన్ని సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా గూడూరు ఎమ్మెల్యే పాశిం సునీల్ కుమార్ హాజరయ్యారు. ఈ సందర్భంగా గూడూరు సిపిఎం నాయకులు వారికి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా జోగి శివ కుమార్ మాట్లాడుతూ రైతులు మీ సేవ ద్వారా రైతులు అప్లై చేసుకొని నాలుగు నెలలు గడుస్తున్నా ఇంత వరకు రైతులకు మంజూరు చేయకపోవడంలో ఆంతర్యం ఏమిటని రెవెన్యూ అధికారులను ప్రశ్నించారు. ఇకనైనా రెవెన్యూ అధికారులు త్వరితగతిన పరిశీలించి సకాలంలో పట్టాదారు పాసు పుస్తకాలు మంజూరు చేయా లని కోరారు. ఈ కార్యక్రమంలో సిఐటియు పట్టణ కార్యదర్శి సురేష్, ఆటో వర్కర్స్ యూనియన్ నాయకులు బివి రమణయ్య, కెవిపిఎస్ నాయకులు అడపాల ప్రసాద్ పాల్గొన్నారు.

ఎరువుల దుకాణాల తనిఖీ

ప్రజాశక్తి -నాయుడుపేట: వ్యవసాయ అధికారులు ఎరువుల దుకాణాలను సోమవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎరువులు, పురుగు మందుల దుకాణాల నిర్వాహకులు విధిగా రిజిస్టర్ మెయింటెన్ చేస్తూ రైతులకు నాణ్యమైన మందులు, విత్తనాలు అందించారు. షాపుల్లో తనిఖీలు నిర్వహించామని వ్యవసాయ అధికారులు పేర్కొన్నారు. నాయుడుపేటలోని ఎరువుల పురుగుల మందుల దుకాణాల్లో నాయుడుపేట వ్యవసాయ అధికారులు నాయుడుపేట పట్టణంలోని మూడు దుకాణాల్లో తనిఖీలు నిర్వహించారు. మూడు దుకాణాల్లో 5,86,550 రూపాయలు విలువచేసే మందులు లెక్కలు సరిగా లేవని వాటిని నిలుపుదల చేశారు. లెక్కలు అన్నీ సరిగా చూపించిన తర్వాత వాటిని అమ్ముకునేందుకు అనుమతులు ఇస్తామని దుకాణాల లైసెన్స్ దారులకు తెలిపారు. రైతులకు సరైన నాణ్యతగల విత్తనాలు మందులు అందించాలని వీటిని ఎవరు అతిక్రమించినా వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని లైసెన్స్ దారులను హెచ్చరించారు. ఈ దాడుల్లో స్పెషల్ స్క్వాడ్ అధికారి ఎన్‌పిఎల్లప్ప, ఏడిఏ డి.జీవానందం, తిరుపతి జిల్లా ఏడిఏ జి. ధనుంజయ రెడ్డి, నాయుడుపేట అగ్రికల్చర్ అధికారి జె.గణేష్ సిబ్బంది పాల్గొన్నారు.

వేధించకుండా విధుల్లోకి తీసుకోండి: ఆర్టీసీ కార్మికులు

మాట్లాడుతున్న ఆర్‌టిసి కార్మికులు

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): తమను వేధించకుండా ఆర్టీసీ విధుల్లోకి తీసుకోవాలని, దశాబ్ద కాలంగా అధికారులు, ప్రజా ప్రతినిధుల చుట్టూ తిరుగుతూనే ఉన్నామని, ఇప్పుడైనా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్, రవాణా శాఖ మంత్రి చొరవ తీసుకుని తమను విధుల్లోకి తీసుకోవాలని ఆర్టీసీ కార్మికులు పివి రెడ్డి, పివై రెడ్డి, కె.ధనంజయ నాయుడు, కె.గంగయ్య విజ్ఞప్తి చేశారు. సోమవారం తిరుపతి ప్రెస్ క్లబ్ లో విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ఆర్టీసీ ఉద్యోగులకు సంబంధించి హైదరాబాద్ తార్నాకలో ఉన్న హాస్పిటల్లో వైద్య పరీక్షలు నిర్వహించారని, అక్కడి వైద్యాధికారులు ఆర్టీసీ విధి నిర్వహణకు తాము పనికిరామని సిఫార్సు లేఖలు రాశారన్నారు. ఆర్టీసీ డ్రైవర్ గా కాకుండా వివిధ కేటగిరీలకు సంబంధించిన ఉద్యోగ బాధ్యతలు ఇవ్వాలని ఇన్నేళ్లుగా అధికారులు, ప్రజా ప్రతినిధులకు వివరిస్తూ తిరుగుతున్నామన్నారు. ఎవరు పట్టించుకోకపోవడంతో తమ కుటుంబాలు రోడ్డున పడే ప్రమాదం ఏర్పడిందన్నారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో 50 మంది, రాష్ట్రవ్యాప్తంగా 13 జిల్లాల్లో 900 మంది ఆర్టీసీ కార్మికులు ఈ విధంగా విధులు లేక, కుటుంబాలను పోషించలేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. తమ సమస్యను సీఎం నారా చంద్రబాబు నాయుడు పరిశీలించి తమకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో అరుణ పాల్గొన్నారు.

విశ్రాంత ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి - తిరుపతి టౌన్: ఉద్యోగ విరమణ చేసిన ఉద్యోగుల సమస్యలను నూతన ప్రభుత్వం పరిష్కరించాలని వక్తలు డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల రాష్ట్రస్థాయి సంఘం కార్యవర్గ సమావేశం స్థానిక ఎల్‌ఐసి రోడ్ లోని ఆఫీసర్స్ క్లబ్‌లో సోమవారం నిర్వహించారు. రాష్ట్ర అధ్యక్షులు పిఎస్ఎస్ఎన్‌పి శాస్త్రి మాట్లాడుతూ నూతన ప్రభుత్వ సహకారంతో విశ్రాంత ఉద్యోగుల సమస్యలు పరిష్కారానికి కృషి చేస్తామని పేర్కొన్నారు. రావలసిన బకాయిల విషయంలో సంఘం పోరాడుతుందని ప్రభుత్వానికి తెలపాల్సిన డిమాండ్ల గురించి సమావేశంలో చర్చించారు. ఇప్పటివరకు బకాయిలు ఉన్న డిఆర్ లు మొత్తం చెల్లించేలాగా, పన్నెండవ పిఆర్సి అమలు కావడానికి ఆలస్యమయ్యే అవకాశం ఉన్నందున ఐఆర్ ప్రకటించాలని కోరారు. 11వ పిఆర్సిలో తగ్గించిన అడిషనల్ క్వాంటం తిరిగి పాత పద్ధతిలో 70 సంవత్సరాలు పూర్తయిన పెన్షనర్లకు 10 శాతం, 75 సంవత్సరాలు పూర్తి చేసుకున్న వారికి 15 శాతం అడిషనల్ క్వాంటం ఇవ్వాలన్నారు. డెత్ రిలీఫ్ పాత పద్ధతి ప్రకారం ఒక నెల పెన్షన్ ఇవ్వాలన్నారు. మెడికల్ క్లెయిములు రెండు లక్షల నుండి ఐదు లక్షల వరకు పెంచాలన్నారు. అమరావతిలో సొంత భవన నిర్మాణానికి 300 చదరపు గజాల స్థలాన్ని ఇవ్వాలని కోరారు. ఈ సమావేశంలో రాష్ట్ర జనరల్ సెక్రటరీ ఎల్ లక్ష్మీనారాయణ, కోశాధికారి పి.నాగ రాజు, అసోసియేట్ ప్రసిడెంట్లు ఆర్ రామ్మూర్తి, కె ఎస్ హనుమంతరావు పాల్గొన్నారు.

టిటిడి మాజీ ఈవో, మాజీ చైర్మన్‌పై సీఎస్‌కు ఫిర్యాదు

ప్రజాశక్తి -తిరుపతి : టిటిడి మాజీ ఈవో ధర్మారెడ్డి, మాజీ ఛైర్మన్ భూమన కరుణాకర్ రెడ్డిలపై సీఎస్ నీరభ్ కుమార్‌కు టిడిపి జాతీయ అధికార ప్రతినిధి గురజాల మాల్యాద్రి, రాష్ట్ర అధికార ప్రతినిధి నీలయపాలెం విజయ్ కుమార్ సోమవారం ఫిర్యాదు చేశారు. వైసీపీకి లబ్ధి చేకూర్చేందుకు ధర్మారెడ్డి, భూమన కరుణాకర్ రెడ్డి అక్రమాలకు పాల్పడ్డారని, సంప్రదాయాలకు విరుద్ధంగా నడుచుకున్నారని, వారిపై సీబీ సీఐడి లేదా విజిలెన్స్ శాఖతో విచారణ జరిపి అక్రమాలను వెలికి తీయాలని కోరారు.

టిటిడి ఈవోను కలిసిన తిరుపతి ఎంపి

ప్రజాశక్తి -తిరుపతి సిటీ : తిరుపతి పార్లమెంట్ సభ్యులు మద్దిల గురుమూర్తి, టిటిడి ఈవో శ్యామల రావును సోమవారం మర్యాద పూర్వకంగా కలిశారు. స్థానిక టిటిడి పరిపాలన భవనంలో ఈవోను కలిసి ఆయన మాట్లాడుతూ తిరుపతి స్విమ్స్ లో డిఆర్ డిఓ – డెబెల్ తో చేసుకున్న ఆధునాతన వైద్య పరిశోధన ఎంఓయు, భారత రక్షణ పరిశోధన సంస్థ డి ఆర్ డి ఓ– డెబెల్ ఎంఓయును అమలు చేయాలని, డీ.ఆర్.ఎం.ఎల్ తో ఇంప్లాంట్స్ తయారీ కి ఎంఓయు చేసుకునేందు కు చర్యలు తీసుకోవాలని కోరారు. దీని వల్ల పేదలకు, శ్రీవారి భక్తుల కు మరిన్ని అధునాతన వైద్య సదుపాయాలు అందుబాటు లో కి వస్తాయని ఈవో దృష్టి కి తెచ్చారు.

క్రైం న్యూస్

రైలు ఢీకొని గుర్తు తెలియని మహిళ మృతి

ప్రజాశక్తి -రామచంద్రాపురం (చంద్రగిరి): రైలు ఢీకొని గుర్తు తెలియని మహిళ మృతి చెందిన సంఘటన మండలంలోని నర్సింగాపురం రైల్వే గేటు వద్ద సోమవారం చోటుచేసుకుంది. సోమవారం మధ్యాహ్నం 3 గంటలకు రైల్వే సిబ్బంది గేటు వేసి ఉన్నప్పటికీ ఆ మహిళ గేట్లో దూరి రైలు పట్టాలపై వెళుతుండగా రైలు ఢీకొనడంతో మహిళ పట్టాలపై పడి మృతి చెందింది. రైల్వే సిబ్బంది సాయంత్రం నాలుగు గంటలకు రైలు పట్టాలపై మృత దేహాన్ని గుర్తించి పాకాల రైల్వే పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో పాకాల రైల్వే పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని గుర్తు తెలియని మహిళ మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తిరుపతి రుయాస్పత్రికి తరలించారు. మహిళ వయసు సుమారు 50 సంవత్సరాలు ఉంటుంది. చందనం, పచ్చ కలర్ గలిగిన చీర ధరించి ఉంది. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పాకాల రైల్వే పోలీసులు తెలిపారు.

లోయలోకి దూసుకెళ్లిన లారీ

స్వల్ప గాయాలతో డ్రైవర్ సురక్షితం

ప్రజాశక్తి -రామచంద్రాపురం(చంద్రగిరి) : లారీ యాభై అడుగుల లోయలోకి దూసుకెళ్లిన ఘటన భాకరాపేట కనుమ రహదారిలో సోమవారం చోటు చేసుకుంది. రాయచోటి నుండి చెన్నైకి వెళుతున్న లారీ బాకరాపేట కనుమ రహదారికి రాగానే అదుపుతప్పి యాభై అడుగుల లోయలోకి దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో డ్రైవర్ స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. ప్రమాద ఘటన స్థలం వద్దకు చేరుకున్న చంద్రగిరి పోలీసులు డ్రైవరును 108 లో తిరుపతి రుయా ఆస్పత్రికి తరలించారు. డ్రైవర్ అతివేగం కారణంగానే ఈ ప్రమాదం సంభవించినట్లు పోలీసుల ప్రాథమిక విచారణలో తెలిసిందన్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఎర్రచందనం దుంగలు స్వాధీనం

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం) శేషాచలం అటవీ పరిధి అన్నమయ్య జిల్లా పీలేరు అటవీ ప్రాంతంలో 14 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకుని, ఒక స్మగ్లర్ ను అరెస్టు చేశామని టాస్క్ ఫోర్స్ పోలీసులు తెలిపారు. టాస్క్ ఫోర్స్ ఇన్‌ఛార్జి, తిరుపతి జిల్లా ఎస్పీ వి.హర్షవర్ధన్ రాజు ఆదేశాలతో టాస్క్ ఫోర్సు ఎస్పీ పి.శ్రీనివాస్ అధ్వర్యంలో ఆర్ఐ సురేష్ కుమార్ రెడ్డికి చెందిన విష్ణువర్ధన్ కుమార్ బందం ఆదివారం తిరుపతి హెడ్ క్వార్టర్స్ నుంచి అన్నమయ్య జిల్లా కేవీపల్లి మండలం పీలేరు అటవీ ప్రాంతంలోని ఎల్లమంద చేరుకుని, మంచాల మంద వైపు కూంబింగ్ ఆపరేషన్లను ప్రారంభించారన్నారు. మారెళ్ల ఫారెస్టు బీటు పరిధిలోని పింఛానది సమీపం చేరుకునే సరికి కొంత మంది వ్యక్తులు తలలపై ఎర్రచందనం దుంగలు మోసుకుని వెళుతూ కనిపించారన్నారు. టాస్క్ ఫోర్సు పోలీసులు వారిని హెచ్చరించి చుట్టు ముట్టే ప్రయత్నం చేయగా, వారు దుంగలను పడేసి పారిపోయే ప్రయత్నం చేశారన్నారు. వారిని వెంబడించి ఒకరిని పట్టుకున్నామన్నారు. పట్టుబడ్డ స్మగ్లర్ తమిళనాడు రాష్ట్రం వేలూరు జిల్లా ఆనైకట్టు ప్రాంతానికి చెందిన బలరామన్ పెరిగే స్వామిగా గుర్తించామన్నారు. టాస్క్ ఫోర్స్ పోలీసు స్టేషన్ లో కేసు నమోదు చేసి ఎస్ఐ సిహెచ్ రఫీ దర్యాప్తు చేస్తున్నారన్నారు.

పుత్తూరు టౌన్ :పుత్తూరు సదాశివ కోన సమీపంలోని మల్లేటి మిట్ట ప్రాంతంలో ముగ్గురు వ్యక్తులు 14 ఎర్రచందనం దుంగలను పట్టుకు పారిపోతున్న వారిని పట్టుకున్నామని పుత్తూరు ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ మాధవి తెలిపారు. వారిలో ఇద్దరు పరారు అయ్యారని తెలిపారు. దీంతో ఒక వ్యక్తిని అరెస్ట్ చేసిసుమారు 87 వేల రూపాయలు విలువగల 14 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. వీరిపై కేసు నమోదు చేసుకుని రిమాండ్ కు తరలించామన్నారు.

నర్స్ పై మతిస్థిమితం లేని రోగి దాడి

ప్రజాశక్తి -తిరుపతి సిటీ : మతిస్థిమితం సరిగ్గా లేని ఓ రోగి నర్స్ పై దాడి చేసి గాయపరచిన ఘటన ఆదివారం రాత్రి తిరుపతి రుయా ఆసుపత్రిలో చోటు చేసుకుంది. వైద్యుల కథనం మేరకు.. మదనపల్లి రాజా నగర్ కు చెందిన దుర్గాప్రసాద్ పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడడంతో కుటుంబ సభ్యులు ఆయనని శుక్రవారం తిరుపతి రుయా ఆసుపత్రికి తీసుకువచ్చారు. ఆసుపత్రి అత్యవసర విభాగంలో చికిత్స పొందుతున్న అతను పురుగుల మందు తీవ్రత వల్ల ఇరిటేషన్‌కు గురయ్యాడు. మానసిక సమస్య కారణంగా విచక్షణ కోల్పోయిన అతను పక్కనే రోగులకు వైద్య సేవలు అందిస్తున్న నర్సు యశోద(38) పై దాడి చేశాడు. సెలైన్ స్టాండ్ తో వెనకనుంచి కొట్టడంతో ఆమె తలకు తీవ్ర గాయం అయ్యింది. వైద్యులు వెంటనే స్పందించి ఆమెకు చికిత్స అందించారు. విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని రోగిని అదుపులోకి తీసుకున్నారు. మూడు రోజులుగా మందులు వాడటం వల్ల, అతనికి మానసిక పరిస్థితి సరిగా లేకపోవడంతో, ఇలా వ్యవహరించాడని, ఇందులో ఎలాంటి దురుద్దేశ్యం లేదని తేలడంతో, పోలీసులు ఎలాంటి కేసు నమోదు చేయలేదు. ఆ రోగిని వైద్యులు ప్రత్యేక గదిలో ఉంచి చికిత్స అందిస్తున్నారు. ఈ ఘటనపై రుయా సిబ్బంది తమకు భద్రత కల్పించాలంటూ సోమవారం ఉదయం నిరసన తెలిపారు.

సమస్యల పరిష్కారంలో అలసత్వం వద్దు: ఎమ్మెల్యే

ప్రజాశక్తి - గూడూరు టౌన్: ప్రజల సమస్యలు పరిష్క రించ డంలో అధికారులు అలసత్వం ప్రదర్శించ వద్దని గూడూరు ఎమ్మెల్యే పాశిం సునీల్ కుమార్ అధికారులకు సూచించారు. గూడూరు సబ్ కలెక్టర్ కార్యా లయ ప్రాంగణంలో ఎమ్మెల్యే పాశిం సునీల్ కుమార్ ఆర్డీవో కిరణ్ కుమార్ , వివిధ శాఖల అధికారులు ప్రజా విజ్ఞప్తుల దినం సోమవారం నిర్వహించారు. వాటిని పరిష్కరించాలని అధికారులను కోరారు.

గూడూరు టౌన్ : గూడూరు సబ్ కలెక్టర్ కార్యాలయంలో గూడూరు పట్టణ , రూరల్, చిల్లకూరు మండ లాల పరిధి లోని అన్ని శాఖల అధికారు లతో ఎమ్మెల్యే పాశిం సునీల్ కుమార్ సోమవారం సమీక్షా సమావేశం నిర్వహిం చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల నుండి వచ్చిన అర్జీల ను పరిశీలించి త్వరతగతిన పరిష్క రించాలని పేర్కొ న్నారు. మండలాలలో తాగు నీటి సమస్య, విద్యుత్ సమస్యలు వస్తే వెంటనే గుర్తించి ప రి ష్ క రి ం చా ల ని ఆదేశించారు.

గూడూరు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

O.S.NO. 98 / 2021

ఆరుమూళ్ల శ్రీనివాసులు ...వాది

Vs

కొండూరు సూర్యనారాయణ రాజు ...ప్రతివాది

దావా నోటీసు

గూడూరు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో పైన కనబర్చిన వాది O.S.NO. 98 / 2021 అనే కేసు దాఖలు చేసి వున్నారు. ఈ కేసు వాయిదా ఈ నెల 24-07-2024 వేసి యున్నారు. ఎవ్వరికైనా ఆక్షేపణలు వున్నయెడల ఆ రోజు ఉదయం 10.30 గం॥లకు కోర్టుకు హాజరు కావలసినదిగా కోరడమైనది.

ఇట్లు,
జానా సురేష్, యం.ఎ, బి.ఎల్.,
వాది తరపు న్యాయవాది, గూడూరు.

ఘనంగా వైఎస్ఆర్ జయంతి

చంద్రగిరిలో

ప్రజాశక్తి -రామచంద్రాపురం: మాజీ ముఖ్యమంత్రి వైయస్ రాజశేఖర్ రెడ్డి 75 వ జయంతిని చంద్రగిరి నియోజకవర్గ వైసిపి ఇన్‌ఛార్జి చెవిరెడ్డి మోహిత్ రెడ్డి ఆధ్వర్యం లో సోమవారం నిర్వహించారు. మండలంలోని నెనూరులో వైయస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్ చేసి పేదలకు పంపిణీ చేశారు. నెమ్మలగుంటపల్లి, నెత్త కుప్పం కుప్పం బాదూరు, కొత్త వేప కుప్పంలో సర్పంచ్ విమాల్ రెడ్డి ఆధ్వర్యంలో ఈ వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎన్ యోగానంద రెడ్డి, ఓబుల్ రెడ్డి, వేణునాథ రెడ్డి, ఎంపీపీ బ్రహ్మానంద రెడ్డి, గిరిధర్ రెడ్డి, గోపి చౌదరి, టి సిద్ధ ముని రెడ్డి, వెంకట్ రెడ్డి. మునీంద్ర యాదవ్, జ్యోతి, చంద్రశేఖర్ రెడ్డి, బి గురుస్వామి రెడ్డి, టెండూల్కర్ రెడ్డి పాల్గొన్నారు.

చంద్రగిరిలో వైఎస్ఆర్ విగ్రహానికి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. పద్మావతి పురం పార్టీ కార్యాలయంలో కేక్ కట్ చేసి పంచి పెట్టారు. పేరూరు పంచాయతీలో వైయస్సార్ విగ్రహానికి చంద్రమోహన్ రెడ్డి, వై చెంచు మోహన్ యాదవ ్లు పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ హేమేంద్ర కుమార్ రెడ్డి, జడ్పిటిసి యుగంధర్ రెడ్డి, మాధవరెడ్డి, బుల్లెట్ చంద్రశేఖర్ రెడ్డి పాల్గొన్నారు. పెరుమాళ్లపల్లిలో సర్పంచ్ జోగి మోహన్ జయంతిని నిర్వహించారు.

బుచ్చినాయుడు కండ్రిగ: బిఎన్ కండ్రిగ మండల వైసిపి కార్యాలయంలో రాజశేఖర రెడ్డి జయంతిని నిర్వహించారు. ముఖ్య అతిథిగా సత్యవేడు నియోజకవర్గ సమన్వయకర్త నూకతోటి రాజేష్, వైఎస్ ఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో సత్యవేడు సోషల్ మీడియా కో కన్వీనర్ వేలూరు రాకేష్ ప్రధాన కార్యదర్శులు జొన్నల గోపాలరెడ్డి, మణి నాయుడు, ఎంపిపి మేకల సుబ్బలక్ష్మి, ఏఎంసి చైర్మన్ ఉగ్గుమూడి గురునాథం(సంధ్య) పాల్గొన్నారు.

వెంకటగిరి: వెంకటగిరి నేదరుమల్లి నివాసంలో వైయస్ రాజశేఖర్ రెడ్డి జయంతి వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో వైసిపి జిల్లా అధ్యక్షుడు రామ్‌కుమార్ రెడ్డి, మున్సిపల్ ఛైర్‌పర్సన్ నక్కా భానుప్రియ, వైస్ ఛైర్మన్ ఎస్ బాలయ్య, నాయకులు ఎల్ కోటేశ్వరరావు, ఎన్ వెంకటేశ్వరరావు, చిట్టేటి హరికృష్ణ, నాగయ్య పాల్గొన్నారు.



వెంకటగిరిలో

తిరుపతి డెస్క్: నారాయణవనం బైబాస్ కూడలి వద్ద వైయస్సార్ విగ్రహానికి ఎంపీపీ దివాకర్ రెడ్డి పూలమాలవేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో వైసిపి సీనియర్ నాయకులు అన్నాదొరై, , మండల కన్వీనర్ సొరకాయలు, వైసిపి నాయకులు పాల్గొన్నారు.

శ్రీకాళహస్తి: మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి చేసిన మంచి ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోతుందని మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి అన్నారు. వైఎస్ రాజశేఖర్ రెడ్డి జయంతిని సోమవారం నిర్వహించారు. స్థానిక రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి మాజీ ఎమ్మెల్యే ఆధ్వర్యంలో పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ ట్రస్ట్ బోర్డ్ ఛైర్మన్ అంజూరు శ్రీనివాసులు, పగడాల రాజు పాల్గొన్నారు.

శ్రీకాళహస్తి రూరల్: శ్రీకాళహస్తి రూరల్ మండలంలోని వాంపల్లి పంచాయతీలో వైయస్ రాజశేఖర్ రెడ్డి జయంతిని వైసిపి నాయకులు, కార్యకర్తలు ఘనంగా నిర్వహించారు. వైయస్సార్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. ముఖ్య అతిథిగా కలవగుంట శ్రీనివాసులు రెడ్డి హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బాలాయపల్లి : వైసిపి మండల అధ్యక్షుడు విందోటి కార్తీక్ రెడ్డి ఆధ్వర్యంలో వైఎస్ఆర్ జయంతిని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వైఎస్ఆర్ విగ్రహానికి పూల మాలవేసి నివాళులర్పించి, రోగులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్య క్రమంలో వెంకటగిరి వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ ఛైర్మన్ వెందోటి మధుసూదన రెడ్డి, వైసిపి నాయకులు వెంకట రమణారెడ్డి , రామ్మూర్తి యాదవ్, గోపాల్ యాదవ్, రాజారెడ్డి, మల్లెల వెంకటేశ్వర్లు, నరేంద్ర యాదవ్ పాల్గొన్నారు.

తిరుపతి డెస్క్: ఏర్పేడులో వైయస్ రాజశేఖర్ రెడ్డి జయంతిని నిర్వహించారు. ఆ పార్టీ మండల అధ్యక్షుడు కోనాటి రమణయ్య యాదవ్ ఆధ్వర్యంలో వైఎస్ఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు వైఎస్ఆర్‌కు నివాళులర్పించారు.

తడ: రాజశేఖర్ రెడ్డి జయంతిని తడ కండ్రిగ పంచాయతీ బోడిలింగాలపాడు గ్రామ సర్కిల్ వద్ద, తడ ప్రభుత్వ ఆస్పత్రిలోని రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి ఆ పార్టీ నాయకులు పూల మాల వేశారు. అనంతరం బొడిలింగాల పాడు లోని ప్రభుత్వ హాస్పిటల్ రోగులకు పండ్లు, బిస్కెట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ మండల కన్వీనర్, తడ సర్పంచ్ ఆర్ముగం, జేసి యస్ కన్వీనర్ సుందర్ రెడ్డి, యువజన నాయకులు తిరుమల రెడ్డి పాల్గొన్నారు.

పుత్తూరు టౌన్ : వైయస్ రాజశేఖర్ రెడ్డి జయంతి వేడుకలు సోమవారం పుత్తూరులో వైసిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఘనంగా నిర్వహించారు. పున్నమి సర్కిల్‌లోని వైయస్సార్ విగ్రహానికి మాజీ మంత్రి, రోజా సోదరుడు కుమారస్వామి రెడ్డి గజమాల వేసి నివాళులు అర్పించారు. కేక్ కట్ చేసి వైఎస్ఆర్ జయంతి వేడుకలు నిర్వహించారు. పుత్తూరు అంబేద్కర్ సర్కిల్ వద్ద సుమారు వెయ్యి మందికి అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్మన్ ఆనంగి హరి, వైస్ ఛైర్మన్లు జయప్రకాష్ (చిట్టి), శంకర్, రెడ్డి వారి మోహన్ రెడ్డి, కేటీ ప్రసాద్, మనోహర్ రెడ్డి, లారీ మోహన్, భాస్కర్ యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

సత్యవేడు: సత్యవేడులోని వైయస్సార్ విగ్రహం వద్ద వైసిపి మండల కన్వీనర్ సుశీల్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో వైయస్సార్ జయంతిని నిర్వహించారు. కేకు కట్ చేసి పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు ఏవీఎం బాలాజీ రెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి పాల్గొన్నారు.

గూడూరు టౌన్ : గూడూరులో వైఎస్ రాజశేఖర్ రెడ్డి జయంతిని ఘనంగా నిర్వహించారు. గూడూరు సాహెబ్ పేటలోని రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి ఎమ్మెల్సీ మురళీధర్, వైసీపీ నాయకులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. గూడూరు ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు.

అంబులెన్స్ వితరణ

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : పట్టణంలోని స్థానిక ప్రభుత్వ హాస్పిటల్ కు మనోహర్ రాజు చారిటబుల్ ట్రస్ట్ సౌజన్యంతో వేదవ్యాస విద్యా సంస్థ అధినేత బాల సరస్వతి, వేద, నారాయణ బాబు, మహా ప్రస్థానం వాహనాన్ని అంబులెన్స్ నగరి నియోజక వర్గ ఎమ్మెల్యే గాలి భాను ప్రకాష్ చేతుల మీదుగా వితరణ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గాలి భాను ప్రకాష్ మాట్లాడుతూ, పుత్తూరు ప్రభుత్వా స్పత్రికి వచ్చే పేదవారు వైద్యం కోసం మనోహర్ రాజు చారిటబుల్ ట్రస్ట్ ద్వారా అంబులెన్స్ ను వితరణ చేయడం వల్ల పేద ప్రజలకు మరెన్నో ఉపయోగాలు ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి పట్టణ అధ్యక్షులు గాలి జీవరత్నం నాయుడు. కార్యదర్శి ఎన్ ఎన్ ధనపాల్, చిత్తూరు జిల్లా పార్లమెంటరీ జిల్లా ఉపాధ్యక్షులు గంజి మాధవయ్య, చిత్తూరు పార్లమెంటరీ జిల్లా అధికార ప్రతినిధి చినబాబు పాల్గొన్నారు.

ORIGINAL Regd. SALE DEED MISSING

It is hereby informed to General Public that Original Registered Sale Deed Doc.No.28/2020, Dated: 06.01.2020 registered in the SRO, Sullurpeta was lost while I am travelling in sullurpeta on 25.06.2024 to take Xerox copies. I am not able to trace the above said documents against my best efforts. Hence, it is appealed to the Public to handover the documents to below address if found.

Kurugonda Murali,
S/o Raja Rathnam, R/o. Sullurpeta
Contact Phone Number: 9966514398

మహారాజశ్రీ గౌరవనీయులు ప్రధాన సివిల్ జడ్జి కోర్టు (సీనియర్ డివిజన్) రాజంపేట

IA NO: 141/2023 And IA NO :142/2023
IA NO :333/2016 And OS NO :167/2016

Between
బొజ్జిరెడ్డి శేషారెడ్డి. ...పెటీషనర్/వాది

V/s

గట్టు సుబ్బారెడ్డి మరియు ఇతరులు
R2. జి.బాలరామకృష్ణ రెడ్డి (died) His LRS
R7. శ్రీమతి చొప్పా పద్మావతమ్మ, W/o రమణారెడ్డి, నాగవరం (V), చిట్వేలి మండలం
R8. శ్రీమతి చల్లా సుభద్రా దేవి, W/o శ్రీపతి రెడ్డి, R/O door No:309, రాజేశం రెసిడెన్సీ, కరకంబాడీ రోడ్డు, తిరుపతి.

...రెస్పాండెంట్స్ /ప్రతివాదులు

నోటీసు

పై చెప్పిన దావాలో R2/D2 మరణించినందున అతని వారసులుగా R7, R8 లను బాధ్యులుగా చేర్చినారు. కాన పై చెప్పిన దావాలో I.A.NO:141/2023 మరియు IA NO :142/2023 మరియు IA NO :333/2016 మధ్యకాలీన దరఖాస్తులు మరియు దావా 02-08-2024 వ తేదీ ఉదయం 10:30 గంటలకు పై చెప్పిన కోర్టులో విచారణకు వాయిదా ఉన్నది కావున, మీరు స్వయముగా గాని, లేక మీ న్యాయవాది ద్వారా గాని హాజరై ఆక్షేపణలు తెలుపుకొనవలను. లేనంతట మీ పరోక్షమున ఉన్న కేసు రికార్డుల మేరకు పరిశీలించి ఉత్తర్వులు పాలించెదరని ఈ నోటీసు ద్వారా తెలియజేయడమైనది.

//By order of the court//
A.వెంకటసుబ్బయ్య, B.Sc., B.A., BL.,
అడ్వకేట్ & నోటరీ,
మొబైల్ :9030543803